సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర, ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేన్నెలపై, ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ధాన్యం సమస్యలు పరిష్కరించేనా..!

గడిచిన రబీ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు

లారీలు, గోనె సంచుల్లేక అవస్థలు

తేమ, చితుకు(ముక్క), పేరుతో మిల్లర్ల దోపిడీ

ఎదురు డబ్బు చెల్లించలేక రైతులు సతమతం

ప్రతి సీజన్‌లోనూ ఇదే పరిస్థితి

ఈ ఖరీఫ్‌లోనైనా సమస్యలు పరిష్కరించాలని రైతులు వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంట చివరి దశకు చేరుతుందంటే రైతుల్లో ఒక్కటే భయం వెంటాడుతోంది. ఈసారైన ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా ఉంటాయా..? అన్న ఆందోళన రైతులను పట్టిపీడిస్తోంది. 'పండించిన ధాన్యం సవ్యంగా కొనుగోలు చేస్తారా.. లారీలు దొరుకుతాయా.. సంచులు ఇస్తారా' ఇలా అనేక అనుమానాలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఒక్కటే ప్రతీసీజన్‌లో ధాన్యం అమ్ముకునేందుకు జిల్లా రైతాంగం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. చేతికొచ్చిన ధాన్యం అమ్ముకోవడం రైతులకు మహాయజ్ఞంలా మారిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరవడం నుంచి లారీలు పంపించకపోవడం, సంచులు అందించకపోవడం, సొమ్ములు సకాలంలో ఖాతాల్లో వేయకపోవడం, తేమ, చితుక(ముక్క) పేరుతో రైతులను నానా ఇబ్బందులు గురిచేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రెండు జిల్లాలోనూ దాదాపు నాలుగులక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. నవంబర్, రెండోవారం నుంచి ఖరీఫ్‌సీజన్ ప్రారంభంకానుంది. దీంతో రైతులను ఇప్పటినుంచే ధాన్యం కొనుగోలు భయం వెంటాడుతోంది. గడిచిన శుక్రవారం ఏలూరు జిల్లాలో వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై చర్చ సాగింది. సంచులు అందుబాటులో ఉంచడంతోపాటు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ జిల్లాకలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిఏటా ఇదేవిధంగా సమావేశాల్లో చర్చిస్తున్నా వాస్తవ పరిస్థితికి వచ్చేసరికి భిన్నంగా ఉంటుంది. మాసూలు చేసి 15 రోజులు గడిచినా లారీలు దొరకడం లేదు. దీంతో రైతులు సొంతంగా లారీలు కట్టించుకోవడంతో పెద్దఎత్తున ఖర్చవుతోంది. తీరా లారీలు రైతులే చూసుకుని ధాన్యం పంపించినా మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. స్థానిక వ్యవసాయాధికారులు తేమశాతం పరిశీలించి అనుమతిస్తున్నా మిల్లర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ రైతుల నుంచి డబ్బు కట్టించుకుంటున్నారు. గడిచిన రబీలో ధాన్యం చితుకు అవుతుందంటూ రైతుల నుంచి సొమ్ములు ఎదురు కట్టించుకున్న ఉదంతాలు బహిరంగంగానే సాగాయి. దీంతో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు పడుతున్న ఇబ్బందులు ప్రతిఏటా పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు.

లారీలు, గోనెసంచులు ఏర్పాటులో నిర్లక్ష్యం

ధాన్యం పట్టేందుకు గోనెసంచులు, తరలించేందుకు లారీల ఏర్పాటులో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. అదేమని అడిగితే ఒకేసారి మాసూలు పూర్తవడంతో ఇబ్బందులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాల్లో ఒకేసారి మాసూళ్లు రావడం ఎప్పుడూ జరిగేది. అందుకు తగినట్లుగా ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకేసారి మాసూళ్లు పూర్తవుతాయని ముందుగానే అందరికీ తెలిసిందే. కానీ అందుకు తగిన చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. మిల్లుల కేటాయింపు సైతం దారుణంగా ఉంటుంది. నిడమర్రు మండలంలోని రైతులకు పెదపాడు, నూజివీడు మిల్లులను కేటాయిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేవిషయంపై కొద్దిరోజుల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ధాన్యం సొమ్ము జమలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 21 రోజుల వ్యవధిలో రైతులకు సొమ్ములు జమకావడం లేదు. గడిచిన రబీ సీజన్‌లో కొంత ఫర్వాలేదన్నట్లు పరిస్థితిసాగింది. వచ్చే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో గతంలో ఏర్పడిన సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం కోరుతోంది.



లోకేష్ పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎంఎల్‌ఎలు ప్రభాకర్, రాధాకృష్ణ

హామీలిస్తూ.. ముందుకు సాగుతూ..!

- చింతలపూడి నియోజవర్గంలో లోకేష్ పాదయాత్రకు ఘనస్వాగతం
- దారిపొడవునా జన ప్రవాహం
- ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ
- విద్యుత్ భారాలు, పెంచిన పన్నులు తగ్గిస్తామని హామీ
- మెరుగైన ఇసుక పాలసీ తెస్తామని భరోసా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ముసునూరు/చింతలపూడి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మూడోరోజు ఆదివారం చింతలపూడి నియోజకవర్గంలో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా లోకేష్ ప్రజాసమస్యలపై హామీలిస్తూ, వినతులు స్వీకరిస్తూ ముందుకుసాగారు. శనివారంరాత్రి ముసునూరు మండలం వలసపల్లిలో బసచేసిన లోకేష్ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వలసపల్లి గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేస్తే తమ గ్రామానికి తాగు, సాగునీరు వస్తాయని, మెట్ట భూములు సస్యశ్యామలమవుతాయన్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అసంపూర్తిగా ఉందని, ఎస్‌సి, బిసి, ఒసి ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని, బిసి, ఒసిలకు శ్మశానవాటిక లేదని, అర్హత ఉన్న వితంతువులకు నెలల తరబడి పెన్షన్ రావడం లేదని, డంపింగ్ యార్డ్‌లేదని, తమ్మిలేరుతో గ్రామంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో ప్రాజెక్టులకు గ్రీజు పెట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పంచాయతీ నిధులను దారిమళ్లించి నిర్వీర్యం చేశారన్నారు. తమ్మిలేరుపై సైడ్‌వాల్స్ నిర్మించి ముంపు బెడద తప్పిస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరువంటి మౌలిక సదుపాయాలకు పెద్దపీటవేస్తామన్నారు. ముసునూరు మండలం నుంచి చింతలపూడి నియోజకవర్గ సరిహద్దు ప్రాంతం వలసపల్లి అడ్డరోడ్డు వద్ద లోకేష్‌కు జిల్లా, నియోజకవర్గ నాయకులు పెద్దఎత్తున గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. రోడ్లను జనంతో కిక్కిరిసిపోయాయి. చింతలపూడి నియోజ కవర్గంలోకి పాదయాత్ర చేరుకోగానే ఉమ్మడి కృష్ణా జిల్లానేతలు వీడ్కోలు పలికారు. ధర్మాజీగూడెం శివారులో లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. పార్టీ కేడర్‌కు ఏ కష్టమొచ్చినా వెన్నంటే ఉంటామని, భరోసా ఇచ్చారు. ఇదేస్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో విజయదుందుభి మోగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాదయాత్రలో ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీమంత్రి పీతల సుజాత, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, నియో జకవర్గ నాయకులు రోషన్‌కుమార్ నాయకులు ఉన్నారు.

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పల్లెల్లో మౌలిక వసతుల ఏర్పాటే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం వైఎస్‌పాలెం గ్రామంలోని చవాకులవారిమెరకలో 15 లక్షల రూపాయలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తోందన్నారు. ఈ గ్రామంలో ఒక హైస్కూలు, ఐదు ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయని, ఈ ఏడాదితో మొత్తం పాఠశాలలు నాడు - నేడు ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేసుకుంటామని తెలిపారు. సుమారు రూ.కోటీ 70 లక్షలు నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేసుకుంటున్నామన్నారు. ఈ నాలుగేళ్లలో సుమారు 10 కోట్ల రూపాయలు గ్రామాభివృద్ధికి ఖర్చు చేశామని, 1200 గడప ఉన్న ఈ గ్రామంలో సుమారు 26 కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్నన పొందుతోందన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేసేందుకు దాతలు, సంఘ పెద్దలు సహకరించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కడలి రాంబాబు, దొంగ మురళీకృష్ణ, మైలాబత్తుల శ్రీను, కిరణ్, చవాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

దశలవారీగా నిరసన దీక్షలు

ప్రజాశక్తి - ఉండి

పెంచిన ధరలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకూ మండలంలోని గ్రామాల్లో దశలవారీగా నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాందువ్వ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం సమరభేరి పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ధరలన్నీ తగ్గిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పిన నరేంద్ర మోడీ సామాన్యునికి అందలేనంతగా ధరలు విపరీతంగా పెంచేసి పేదవాడి నెత్తిన గుదిబండగా మార్చేశాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాదాసు గోపి, సిహెచ్ ఏసుబాబు, పి.సుబ్రహ్మణ్యం, ఎం.మహేంద్ర, యాళ్ల లక్ష్మణరావు, మోపిదేవి రాము, జి.కాసులు, సిహెచ్ చిన్న, ఎం.మహేందర్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పరిపాలన ఘనత జగన్‌దే : ఎంపీ శ్రీధర్



మాట్లాడుతున్న ఎంపీ శ్రీధర్, ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

ప్రజల వద్దకే పరిపాలన తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే అని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం గణపవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఒకచోటే ఉంటే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు పరిపాలన వ్యవస్థను దగ్గరికి తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకటరామరాజు, గ్రామ సర్పంచి మూర అలంకారం, ఉపసర్పంచి దండు రాము ఎంపిటిసిలు బత్తి సీతామహాలక్ష్మి, దండు రవి, ఎంపిడిఒ జ్యోతిర్మయి, వైసిపి నాయకులు రొంగల శ్రీను పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

ఎబిఎస్‌వికెలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరంరూరల్

ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. పట్టణంలోని మెంటే వారి తోట సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్ బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ మెడికల్ క్యాంపులో మన హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.సందీప్ వర్మ, తేజ హాస్పిటల్ వైద్యులు పొనమండ వెంకట మహాలక్ష్మి పాల్గొని వైద్య సేవలందించారు. తక్కువ ధరకే అవసరమైన మందులు ఇన్సులిన్, నెలలవారీగా అందించారు. రోగులకు బిపి, షుగర్, అవసరమైన వారికి ఇసిజి పరీక్షలు చేశారు. 3 నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎంవి.రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ బి.బలరాం, ట్రస్టీ బి.వాసుదేవరావు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, అజయ్ కుమార్, సాహితీ స్రవంతి కన్వీనర్ చైతన్య ప్రసాద్, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు యు.శ్రీనివాస్, కె.సూర్యచంద్రరాజు పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేషమ్మ చెరువులో ఉద్రిక్తత

డ్రెయినేజీ నిర్మాణం ఆపాలని రోడ్డెక్కిన మహిళలు

పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని శేషమ్మచెరువు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డ్రెయినేజీ అక్రమ తవ్వకాలను తక్షణం ఆపాలంటూ మహిళలు ఆదివారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. గ్రామ సర్పంచిని నిలదీశారు. ఈ నేపథ్యంలో సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలు, సర్పంచితో మాట్లాడారు. దీనిపై మహిళలు మాట్లాడుతూ డ్రెయినేజీ తవ్వకం పనులు నిలిపి వేయాలని కోర్టులో స్టే ఉన్నప్పటికీ రహదారికి ఇరువైపులా తవ్వడం మానేసి కేవలం రాజకీయ కక్షతో ఒక వైపే డ్రెయినేజీ తవ్విస్తున్నారని తెలిపారు. సర్పంచి రాజకీయంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచి మాట్లాడుతూ న్యాయబద్ధంగా పనులు చేస్తున్నామని, మరలా గ్రాంటు వస్తే మరో డ్రెయినేజీ నిర్మిస్తామని తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ సర్పంచి మామిడిశెట్టి కృష్ణవేణి మాట్లాడుతూ డ్రెయినేజీ విషయంలో సర్పంచిని నిలదీయడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో పూడ్చిన బోదె స్థానంలోనే నేడు డ్రెయినేజీ కింద పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పటి నుండో ఉన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు ఎంఎల్‌ఎ రంగనాథరాజు సహకారంతో రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆ నిధులను సద్వినియోగం చేసుకోకుండా అడ్డు తగలడం సరికాదన్నారు. కొందరి మాటలు విని డ్రెయినేజీ నిర్మాణం ఆపాలని చూస్తున్నారని తెలిపారు. ఇది సరికాదని తెలిపారు. అయితే పోలీసుల రాకతో సమస్య సద్దుమణిగింది.

ప్రజాశక్తి - ఆచంట శేషమ్మ చెరువులో ఇరుపక్షాలతో మాట్లాడుతున్న పోలీసులు

నా బిడ్డ మరణానికి.. గణేష్ వేధింపులే కారణం

కేసు పెడితే పోలీసులు పట్టించుకోవడం లేదు

మాఫీ చేసేందుకు కొందరు ప్రయత్నం

నాకు దిక్కెవరు : ఏసు తల్లి ఆవేదన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తన కొడుకు ఏసు ఎలక్ట్రిషియన్ గణేష్ వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి చింతా నాగమణి మీడియా వద్ద కన్నీటి పర్యంతమైంది. ఈ నెల పదో తేదీన స్థానిక భీమవరం 19వ వార్డులోని తన ఇంటి దూలానికి ఉరివేసుకుని ఏసు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తల్లి నాగమణి ఆదివారం మీడియాతో మాట్లాడారు. తాను హోటల్లో పని చేస్తానని, తన కొడుకు పెయింటింగ్ పని చేస్తాడని తెలిపింది. గతంలో మారోజి గణేష్ వద్ద తన కొడుకు పని చేసేవాడని, అయితే గణేష్ డబ్బులు సరిగా ఇవ్వకపోవడంతో అక్కడ పని మానేసి పెయింటింగ్ పని చేస్తున్నాడని తెలిపింది. నెలరోజుల క్రితం పోతిరెడ్డి సురేష్ అనే వ్యక్తి ఇనుప పైపును పట్టుకునేందుకు సాయం పట్టాలని తన కొడుకును తీసుకెళ్లాడని, అది చూసిన గణేష్ స్థానిక వాలంటీర్లకు సమాచారం ఇచ్చాడని తెలిపింది. ఆ పైపు సచివాలయం వద్ద జెండా ఎగురవేసేదని, గణేష్ తమ ఇంటికి సచివాలయ ఉద్యోగిని తీసుకొచ్చి, ఏసు ఆ పైపును దొంగతనం చేశాడని చెప్పాడని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఆ పైపును పాలెం కిషోర్‌కు అమ్మినట్లు వీడియో తీసి పోలీసులకు ఇచ్చారని తెలిపింది. అయితే అదే రోజు అర్ధరాత్రి పోలీసులు తన కొడుకును బెదిరించి ఇంటికి పంపించేశారని, అయినా గణేష్ వీడియోను అందరికీ పంపించి, రౌడీ షీట్ ఓపెన్ చేస్తానని, తనకు అందరూ తెలుసని బెదిరించాడని వాపోయింది. దీంతో భయపడిన ఏసు హైదరాబాద్ వెళ్లిపోయాడని, అయినా గణేష్ తన కొడుకుకు ఫోన్ చేసి బెదిరించాడని, ఈ వేధింపులు భరించలేక తిరిగి భీమవరం వచ్చి అవమానంతో ఆత్మహత్య చేసుకున్నాడని, తనకు ఇక దిక్కెవ్వరంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకు చావుకు కారణమైన గణేష్‌ను, మిగిలిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆమె వేడుకుంటోంది.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రజాశక్తి - భీమవరం

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోట ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రజక వృత్తిదారుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రజకులు ఉన్నారన్నారు. రాష్ట్ర జనాభాలో రజకులు ఐదు శాతం ఉన్నారని పేర్కొన్నారు. నూటికి 50 శాతం మంది రజకవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. నేటికీ సమాజంలో కులం పేరుతో దూషిస్తూ రజకులపై దాడులు అత్యాచారాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దాడులు అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ మాదిరిగా ఒక సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో రజక వృత్తి కోసం కేటాయించిన వందలాది చెరువులపై పెత్తందారుల కన్నుపడి అనేక గ్రామాల్లో చెరువులు రజకులకు హక్కు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అయినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేసి రజక యువతి యువకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి రజక కుటుంబానికీ రజక కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో రెండు లక్షల రూపాయల రుణాలిచ్చి పెద్ద గ్రామాల్లో, పట్టణ కేంద్రాల్లో మోడ్రన్ దోబీ గాడ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మడకా రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వద్దిపర్తి శ్రీనివాస్ మాజీ జిల్లా కార్యదర్శి, యండమూరి వెంకట సుబ్బారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో రజక సంఘం నేతలు

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీలో కమిటీ సభ్యులు, చిన్నారులు

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఉండి

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఉండిలోని స్వాతంత్ర్య సమరయోధుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చంద్రయాన్ విజయయోత్సవ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి వరదరాజు, కాగిత మాతయ్య, విశ్రాంత జవాన్, కలిసిపూడి ఎంపిటిసి సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం కావడం భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇస్రో శాస్త్రవేత్తలు ఎన్నో కష్టాలు పడి చంద్రయాన్-3 సిద్ధం చేశారన్నారు. వారు పడ్డ కష్టానికి ప్రతిఫలం లభించిందన్నారు. చంద్రమండలం దక్షిణ ధ్రువఅల్లో మొట్టమొదటిసారిగా భారత జాతీయ జెండా రెపరెపలాడిందన్నారు. దీనికి కారకులైన ఇస్రో శాస్త్రవేత్తలకు, భారత ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరంలో వైద్యులు, ప్రజలు

మానవత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పాలకొల్లు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గుండె సంబంధిత వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత గుండె, ఊపిరితిత్తుల వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ కంటి ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్.పాపారావు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపారావు నాయుడు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పాలకొల్లు శాఖ పనితీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. పాలకొల్లు అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి పిఎస్.ప్రతాప్‌రాజు, కోశాధికారి మద్దాల వాసు, మేడికొండ శ్రీనివాస్ చౌదరి, ముత్యాల రామారావు, క్యాంపు కో-ఆర్డినేటర్లు మేడికొండ రామదాసు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు పివి.సురేష్‌కుమార్, ఎం.మాధవరావు, పైడి అనిరుధ్‌కుమార్, ఎన్.వెంకటరెడ్డి రోగులను పరీక్షించి తగిన వైద్య సేవలు అందించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన 285 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది

తామరాడలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని తామరాడలో విషజ్వరాలు సోకి పలువురు అనారోగ్య పాలు కావడంతో అధికారులు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఆదివారం ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి జ్వరాలతో బాధపడుతున్నవారిని గుర్తించి వైద్యం అందించేలా కృషి చేశారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్రామంలో పూర్తిగా సున్నా కేసులు వచ్చేవరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగిస్తామని, ఎప్పటికప్పుడు ప్రతి ఇంటిని సర్వే చేస్తామని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుదలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

బాధితులను పరామర్శిస్తున్న బొమ్మిడి నాయకర్

బాధిత కుటుంబానికి జనసేన నేత పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పట్టణ 16వ వార్డు కౌన్సిలర్ గొల్ల జయరాజ్‌సింగ్ ఇటీవల వాకింగ్ చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ ఆదివారం పరామర్శించారు. జయరాజ్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు జనసేన నియోజకవర్గ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

తెగి పడిపోయి ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సఖినేటిపల్లి సత్యనారాయణ (65) అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణ గొల్లలకోడేరులోని యనమదుర్రు డ్రెయిన్ సమీపంలో ఉన్న తన ఖాళీ స్థలంలో ఆదివారం మొక్కలను శుభ్రం చేస్తున్న సమయంలో తెగి ఉన్న వైరు తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి విద్యుత్ శాఖ సిబ్బంది, పోలీసులు చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని విద్యుత్ శాఖ ఎఇ అప్పారావు తెలిపారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

సంఘటన స్థలంలో సత్యనారాయణ మృతదేహం

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డాక్టరేట్ అవార్డు గ్రహీత నిరీక్షణరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె గ్రామానికి చెందిన నిరీక్షణరాజుకు సమాజ సేవ చేసినందుకు డాక్టరేట్ రావడం అభినందనీయమని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజనసమాఖ్య సంఘ వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య అన్నారు. నిరీక్షణరాజును కోపల్లెలోని ఆయన నివాసంలో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమాఖ్య సభ్యులు, పలువురు నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరీక్షణరాజు తన సంపాదనలో కొంత సొమ్మును సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు తన వంతు సాయం చేస్తున్నారన్నారు. ఆక్వా రంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా స్థిరపడి 15 ఏళ్లుగా కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందిస్తున్నారన్నారు. కోపల్లె గ్రామంలో అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహిస్తూ పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కరోనా మొదటి, రెండు దశల్లో వందలాది మంది కార్మికులకు రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. నిరీక్షణరాజు చేస్తున్న సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్ రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డు వరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమాఖ్య సంఘ వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య, మైప ఎంపిటిసి సభ్యులు ఆనందరాజు, ఉండి మండల అధ్యక్షులు కొండా రాజేష్‌కుమార్, దానియేలు, షాలేమ్‌రాజు పాల్గొన్నారు.


నిరీక్షణరాజును సత్కరిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బహుజన సమాఖ్య సభ్యులు

లబ్ధిదారులందరికీ 'చేయూత' అందించాలి

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్ఆర్ చేయూత పథకం లబ్ధిదారులకు ఇంటి పన్ను రసీదు ఉంటేనే పథకం వర్తిస్తుందని చెప్పడం అన్యాయమని సిపిఎం చిన్నరంగడిపాలెం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చిన్నరంగడిపాలెంలో మద్దాల రాంబాబు అధ్యక్షతన ఆదివారం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అందరికీ సంక్షేమ పథకాలు ఇస్తున్నామని చెప్పి ఆ పథకాల్లో రకరకాల కోతలు పెట్టి సంక్షేమ పథకాల కోత పెడుతున్నారన్నారు. అద్దె ఇళ్లల్లో ఉన్నవారు చేయూతకి అర్హులు కాదా అని ప్రశ్నించారు. అన్ని అర్హతలు ఉన్నా అద్దె ఇళ్లల్లో ఉన్నవారికి ఇంటి పని రసీదు తీసుకొస్తేనే చేయూత అందిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అద్దె ఇళ్లల్లో ఉన్నవారికి ఇంటి పన్నులతో సంబంధం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు అన్ని సంక్షేమ పథకాలు అందేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు ఈ సమావేశంలో సిపిఎం శాఖ సభ్యులు అన్నం రాంబాబు, మద్దాల రాంబాబు, రత్నరాజు పాల్గొన్నారు.

ఎఎంసి అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కమిటీ ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన రసూల్ బేబి కోరారు. నూతనంగా నియమితులైన బోర్డు సభ్యులతో కలిసి ఆకివీడులో ఆమె నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్‌బేబి మాట్లాడుతూ సోమవారం ఉదయం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో తమ బోర్డు సభ్యులతో కలిసి పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఉదయం 8:30కు తమ నివాసం నుంచి మార్కెట్ యార్డ్ కార్యాలయం వరకు మోటార్ సైకిల్ ర్యాలీగా వెళ్తామని తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోర్డు సభ్యులు, కమిటీ వైస్ ఛైర్మన్ గంటా ఆనందరావు కోరారు.

'కౌలు రైతులకు అండగా పవన్‌కల్యాణ్'

ప్రజాశక్తి - ఉండి

కౌలు రైతులను ఆదుకున్న ఏకైక నాయకుడు జనసేనాని పవన్‌కల్యాణ్ అని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు యడవెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం నుంచి ప్రారంభించిన జనంలోకి జనసేన కార్యక్రమంలో జుత్తిగ నాగరాజు పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విస్మరిస్తే వ్యవసాయంలో వచ్చిన నష్టానికి తాళలేక బలవన్మరణానికి పాల్పడిన మూడు వేల మంది రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున రూ.30 కోట్లు సాయమందించి కౌలు రైతుల తరపున నిలబడిన ఏకైక నాయకుడు పవన్‌కల్యాణ్ అని అన్నారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానన్న జగన్ అధికారంలోకొచ్చాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడన్నారు. నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసి కేవలం రూ.ఐదు వేల వేతనంతో వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి వైసిపి కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారన్నారు. 2024 ఎన్నికల్లో తమ పార్టీకి అధికారం ఇస్తే అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి అనిల్, పార్టీ కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, నాయకులు గొట్టుముక్కల సుబ్బరాజు, గేదెల నరసింహులు, అడపా గణేష్, పెదపాటి శివప్రసాద్, యర్రా రవి, కుచ్చు శివకృష్ణ, పోలిశెట్టి బ్రహ్మానందం, కర్రి వెంకటరమణ, కురిటి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇఒ దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

3న బ్లాక్ డే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అక్టోబర్ మూడో తేదీన బ్లాక్‌డేగా పాటించాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఆ రోజు బ్లాక్ డేగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం), కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో 24వ తేదీన నిర్వహించిన సదస్సు విజయవంతమైనట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసభకు వేలాదిమంది రైతు నాయకులు, కార్మిక నాయకులు వచ్చారన్నారు. నల్ల చట్టాలను ఉపసంహరించుకుండా మోసం చేశారని, కమిటీ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పించలేదని, ఉద్యమంలో ప్రాణాలర్పించిన 750 మందికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదని, కార్పొరేటర్లకు సుమారు రూ.14.60 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసి, రైతాంగానికి మాత్రం రుణాలు మాఫీ చేయలేదని విమర్శించారు. నూతన విద్యుత్ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేయడం కార్పొరేటర్లకు ఊడిగం చేయడంలో భాగమేనన్నారు. నవంబర్ 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గవర్నర్ కార్యాలయాల వద్ద వేలాది మందితో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చినట్లు శ్రీనివాసరాజు తెలిపారు.

ప్రజలను పట్టి పీడిస్తున్న అధిక ధరలు : సిపిఎం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కేంద్ర ప్రభుత్వ విధానాలతో అధిక ధరలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, సామాన్యులకు విద్య, వైద్యం రోజురోజుకు దూరమైపోతుందని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నారాయణరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం నరసాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఆదివారం 24వ వార్డులో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం ధరలను అదుపు చేయటంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందన్నారు. ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో పున్నమి అప్పలనాయుడు, టంకాని నారాయణరావు, చిన్నమిల్లి నాగేశ్వరరావు, గంగులూరి వెంకట్రావు పాల్గొన్నారు.


సంతకాల సేకరణలో సిపిఎం నాయకులు

ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కృష్ణమోహన్

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని పెదమామిడిపల్లిలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు చిరు, మదర్ సేవా సమితి అధ్యక్షులు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, జనసేన పార్టీ పాలకొల్లు పట్టణ అధ్యక్షుడు శిడగం సురేంద్ర హాజరయ్యారు. తొలుత మదర్‌థెరిస్సా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. గ్రామంలో ఉన్న నిరుపేద వృద్ధ మహిళలు 50 మందికి చీరలు పంపిణీ చేశారు. ప్రజలకు, అభిమానులకు పండ్లు, సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పెదమామిడిపల్లిలో చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ విగ్రహం స్థాపించి ఆరేళ్ల పూర్తయిందని, ప్రతి సంవత్సరం మదర్‌థెరిస్సా జయంతి, వర్ధంతి క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. మదర్‌థెరిస్సా కలకత్తా మహానగరం మురికివాడలో నివసించే ప్రజలకు, చిన్న పిల్లలకు ఎన్నో సేవలు చేశారన్నారు. కుటుంబ సభ్యులు సైతం పట్టించుకోని కుష్టురోగులను కన్నతల్లిలాగా అక్కున చేర్చుకుని వారికి సేవలు చేశారన్నారు. మదర్‌థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు పెదమామిడిపల్లిలో క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కడలి స్వామి, వెంకటాద్రి, బొక్క సీతారామయ్య, దాసిరెడ్డి పుష్పరావు, కోళ్ల చంద్రరావు, రాపాక నందియ, పరిం రాజు, సాయి, నవీన్, గుబ్బల దేవకృష్ణ, నున్నబోయిన గోపి, సత్య, కొలుసు దుర్గాప్రసాద్, నామన శ్రీనివాస్, యాతం మల్లేశ్వరావు, కొమ్ముల దినేష్ పాల్గొన్నారు.

తాడేరు వంతెనపై ట్రయల్ రన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వంతెన నిర్మాణ పనులకు ఈ ఏడాది ఏప్రిల్ నాలుగో తేదీన శంకుస్థాపన చేయగా నాలుగు నెలల కాలంలో పనులు పూర్తయి ఆదివారం ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. 1929లో వంతెన నిర్మించారు. దాదాపుగా పదేళ్ల క్రితమే వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వంతెన మీదుగా వెళ్తూ ఒకసారి ఆగి పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకుందని గుర్తించి వెంటనే నూతన వంతెన నిర్మాణానికి మొదట రూ.1.90 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. దాదాపుగా తొమ్మిది సార్లు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అంచనాలు పెంచి రూ.2.30 లక్షల నిధులను మంజూరు చేసి టెండర్లు పిలిచారు. ఈ పరిస్థితుల్లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వేగవంతంగా వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించారు. వంతెన నిర్మాణం పూర్తికాగా పది రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహించి అధికారికంగా త్వరలో ఈ వంతెనను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వంతెనను పరిశీలించారు. ఆయనతో పాటు నామన మహేష్, మానేపల్లి నాగన్నబాబు, కొట్టి కుటుంబరావు, కోమటి రాంబాబు ఉన్నారు.

వంతెనను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ఆపన్నులకు కొవ్వలి ఫౌండేషన్ చేయూత


బాధితునికి నిర్మించి ఇచ్చిన గృహంలో ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేశారని ఫౌండేషన్ నిర్వాహకులు నిమ్మకాయల నీలిమ గోపాలరావు, జయలక్ష్మి శ్రీధర్ అన్నారు. మండలంలోని పేరుపాలెం గ్రామంలో నిరాశ్రయులైన మంగి రవి కుటుంబానికి కొవ్వలి ఫౌండేషన్ రూ.లక్ష వెచ్చించి ఇంటి నిర్మాణం పూర్తి చేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నీలిమగోపాలరావు, జయలక్ష్మి శ్రీధర్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ నాయకులు కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని ఆ ఇంటి నిర్మాణం చేసి బాధితులకు అందించామన్నారు. రామ్మోహన్ నాయుడు తనకు ఉన్నదాంట్లో ప్రజలకు సేవ చేసేందుకు ఫౌండేషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, ఉద్యోగ, సామాజికంగా కొవ్వలి ఫౌండేషన్ అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో వడ్డే సూర్యకృష్ణ, చల్లా పరిమి కృష్ణ, కవురు ముత్యాలరావు, వైదాని సత్యనారాయణ, బాలు, బొల్లం ఏసు, చల్లా సుబ్రహ్మణ్యం, సత్తినేని త్రిమూర్తులు, బాబ్జి, శ్రీను, సంకు భాస్కరనాయుడు, చెక్కల సత్యదేవ్, భోగిరెడ్డి ముత్యం, రేవు పద్మారావు పాల్గొన్నారు.

మేకా శేషుబాబుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఉండి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా ఎంపికైన మాజీ ఎంఎల్‌సి, వైసిపి సీనియర్ నాయకులు మేకా శేషుబాబును ఉండి మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు మునుకోలు సింహాచలం, బడుగు బాలాజీ గౌడ్ మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు ఎప్పుడు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత వైసిపి నుంచి మొట్టమొదటి ఎంఎల్‌సిగా గెలుపొందిన మేకా శేషు బాబుకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా అవకాశం ఇచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మేకా శేషుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో వీరమల్లు మల్లేశ్వరరావు, అంగర సునీల్, చేబ్రోలు బాలాజీ, షేక్ కన్నా సాహెబ్, కాగిత బాలాజీ, చిట్టిబొమ్మల సతీష్ మోహన్, బొల్లా అబ్బులు, దొండా రమేష్ ఉన్నారు.

పాలకొల్లు : టిటిడి పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన మేకా శేషుబాబును ఆదివారం యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. టిటిడి సభ్యులుగా నియమితులు కావడం పాలకొల్లుకు గర్వకారణమని అభినందించారు. అనంతరం మేకా శేషుబాబు మాట్లాడుతూ యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. క్లబ్‌కి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షులు గాది ఆంజనేయులు, కార్యదర్శి పశ్యావుల రవికుమార్, కోశాధికారి శేషాద్రి పాల్గొన్నారు.

ఉండి : మేకా శేషుబాబును అభినందిస్తున్న వైసిపి నేతలు

మహిళా సాధికారతే ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళల సాధికారతే టిడిపి ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లాలు) అన్నారు. మండలంలోని కొయ్యేటిపాడులో ఇదేం ఖర్మ, మహిళాశక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కర్రి ఈశ్వర్ వెంకట్ రెడ్డి, కేతా మీరయ్య, బూత్ కమిటీ కన్వీనర్ దొంగ శ్రీనివాస్, సంజీవరావు, కేతా వెంకటేశ్వర్లు, పాలా భోగేశ్వరరావు, నేతల వీర పోచయ్య, దూది స్వామి, పుట్ల ఏడుకొండలు, జె.రాజు పాల్గొన్నారు.

నడిపూడిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పెనుగొండ : మండలంలోని నడిపూడి గ్రామంలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు టిడిపి మినీ మేనిఫెస్టో గుర్తించి వివరించారు. ఈ కార్యక్రమంలో లోకేష్, రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలకొల్లు కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు యాళ్లవానిగరువులో జంక్షన్ వద్ద ఎస్ఆర్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి సొంత స్థలంలో వైసిపి కార్యాలయానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు హాజరయ్యారు.

ఘనంగా జాతరలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శ్రావణమాసం సందర్భంగా పట్టణంలో ఆదివారం జరిగిన పలు అమ్మవార్ల జాతర మహోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టిడ్కో గృహాల సముదాయంలో అక్కడ నివసిస్తున్న ప్రజలు ఆదిలక్ష్మి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో పాల్గొన్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల సముదాయంలో ప్రజలు ఇంత పెద్దఎత్తున అమ్మవారి జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం 25, 26 వార్డుల్లో జరిగిన మావుళ్లమ్మ జాతర మహోత్సవాల్లో కూడా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. వాడవాడలా అమ్మవారి జాతరలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో జట్ల రాంబాబు, జెట్టి వెంకటేశ్వరరావు, గనిరెడ్డి త్రినాథ్, ముచ్చకర్ల సుబ్బారావు, జగ్గు జయరాం, గడప శ్రీను, పెద్దాడ వాసు, లంకి చిన్ని, మానేపల్లి నాగన్న బాబు, కోమటి రాంబాబు, కోడే యుగంధర్, గనిశెట్టి సీతారామయ్య, పొగిరి శ్రీను, అమనపల్లి ఈశ్వరరావు, ప్రసాద్, గనిరెడ్డి పెద్దిరాజు, కోరుకొండ మణికంఠ, పొగిరి సత్యనారాయణ, నందమూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో మౌనధ్యానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిబెట్ మహా యోగి మిలారేపా పుట్టినరోజు సందర్భంగా పెనుమంట్రలో భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు గృహం వద్ద హైదరాబాద్‌కు చెందిన పిరమిడ్ ధ్యాన కేంద్రం సైంటిస్ట్ ఆవంచ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మౌన ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం చేసే పద్ధతి గురించి, మౌనం మనసు భాష , మౌనం ఆత్మ భాష అనే అంశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూర్ విసిఎఫ్ ఫౌండర్ ప్రకాష్‌బాబు, ఎన్.జ్యోతి, సరస్వతి, సేవా కర్తలు సుబ్బారావు, గౌతమ్, గీత, లక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురంలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో మేము సైతం జనసేన వ్యవస్థాపకులు, ఆ పార్టీ నరసాపురం మండల యువత అధ్యక్షులు పసుపులేటి అభి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదివారంతో వందో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నరసాపురం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిఎసి సభ్యులు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం ఛైర్మన్ బొమ్మిడి నాయకర్, నరసాపురం నియోజవర్గ నాయకులు చాగంటి మురళీకృష్ణ, నియోజకవర్గ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు
ఇ.ఎ. 207/2023
ఓ.ఎస్.నెం. 589/2014
శ్రీ కోయి సూర్యచంద్రరావు (డైడ్)
శ్రీ కోయి శ్రీ నాగ వెంకట లక్ష్మి వరప్రసాద్ వగైరా - పిటీషనర్లు / వాదులు
మరియు
ప్రతివాదులు
శ్రీ గూడూరు శ్రావణ్ కుమార్ వగైరా
ప్రపోజ్‌డ్ పార్టీలు
శ్రీమతి గూడూరు రత్నవాణి
శ్రీమతి మత్తి పుష్పలత - రెస్పాండెంట్లు
పై నెంబరు దావాలో వాదులు, ప్రపోజ్‌డ్ పార్టీల దావాలో 3 మరియు 4 ప్రతివాదులుగా చేర్చమని పై నెంబరు పిటీషన్ దాఖలు చేసినారు. సదరు పిటీషనులో ప్రపోజ్‌డ్ పార్టీలకు నోటీసు నిమిత్తం ది.4-9-2023వ తేదీకి వాయిదా అయివున్నది.
కాబట్టి పైన పేర్కొన్న ప్రపోజ్‌డ్ పార్టీలు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్సుపార్టీని చేసి పిటీషను తీర్మానించబడును.
ఏలూరు, తేది: 24-08-2023
ఎస్.వి.ఆర్. గాంధీ అడ్వకేట్